క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 31న ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కొలిమి షమ్మి శనివారం తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని పేర్కొన్నారు. అజెండాలోని అన్ని అంశాలపై చర్చించి ఆమోదించనున్నట్లు తెలియజేశారు. సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

మిరప నారుమడిపై గడ్డి మందు పిచికారీ

పెదకూరపాడు: మిరప నారుమడిపై గుర్తు తెలియని వ్యక్తి అక్కసుతో గడ్డి మందు పిచికారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పెదకూరపాడు – సత్తెనపల్లి రహదారిలో పలువురు రైతులు మిరప నారుమడి పోసుకున్నారు. ఎకరం 50 సెంట్లలో చిన్న, సన్న, కౌలు రైతులు కలసి నర్సరీ ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 15 మంది రైతులు ఐదు కేజీల క్లాసిక్– 327 మిరప విత్తనాలు కొనుగోలు చేసి నాటారు. గుర్తు తెలియని వ్యక్తి గడ్డి మందు ప్రయోగించడంతో నారుమడి ఎండిపోతోంది. రైతుల సమాచారం మేరకు ఉద్యాన శాఖ అధికారులు వచ్చి పరిశీలించారు.

అనుమతి లేకుండా పడవలు నడిపితే చర్యలు



అచ్చంపేట: కృష్ణానదిలో పడవలు నడుపుకునేందుకు ప్రభుత్వ అనుమతులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, ప్రయాణికులకు లైఫ్ జాకెట్స్ తప్పనిసరిగా ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని అచ్చంపేట ఎస్‌ఐ సీహెచ్. మణికృష్ణ హెచ్చరించారు. మండలంలోని మాదిపాడు, గింజుపల్లి, తాడువాయి, చింతపల్లి, పుట్లగూడెం, చామర్రు, అంబడిపూడి పడవ రేవుల్ని ఆయన ఆయన తనిఖీ చేశారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ పరిశీలించారు. పడవల వల్ల అనుకోని సంఘటనలు జరిగితే నిర్వాహకులే బాధ్యత వహించాలని చెప్పారు. పడవల్లో ప్రయాణికులు ఉన్న సమయంలో ద్విచక్ర వాహనాలు, జీవాల్ని ఎక్కించరాదని తెలిపారు. ప్రభుత్వం వారు నిర్ణయించిన ధరల కంటే అధికధరలు వసూలు చేయొద్దని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నరసరావుపేట టౌన్: కుటుంబ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి పట్టణంలో చోటుచేసుకుంది. బరంపేట ఇస్కాన్ టెంపుల్ సమీపంలో నివాసం ఉంటున్న తమ్మలూరి వెంకట సాంబశివరావు (35) శుక్రవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవపడి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు సాంబశివరావుని కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రహంతుల్లా శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు మృతుడి తండ్రి సీతారామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సర్పంచ్‌కు విద్యుదాఘాతం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామ సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావుకు విద్యుదాఘాతమై కిందపడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. శనివారం మరమ్మతులు నిర్వహిస్తుండగా ఈ సంఘటన జరిగింది. వైద్యసేవల నిమిత్తం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. నాగేశ్వరరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు బంధువులు వెల్లడించారు.

చిన్నారుల కథల పోటీలకు స్పందన

నరసరావుపేట ఈస్ట్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం బరంపేటలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో చిన్నారులకు కథ చెబుతారా! ఊ.. కొడతాం కథల పోటీలు నిర్వహించారు. చిన్నారుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, విలువలు పెంపొందించేందుకు పోటీల్ని నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరుజిల్లా సమన్వయకర్త ఈ.అమ్మడు తెలిపారు. జూనియర్స్ విభాగంలో సాయిమణికంత, అల్తాఫ్, విశాల్, సీనియర్ విభాగంలో ఆర్.చక్రి, డి.హారిణి, వి.చరణ్ బహుమతులు సాధించారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

నాదెండ్ల: జాతీయ రహదారిపై సిగ్నల్ బోర్డును తప్పించే క్రమంలో ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన జాతీయ రహదారిపై గణపవరం పరిధిలోని టీబీ ఆసుపత్రి వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గణపవరం గ్రామానికి చెందిన యోహాను ట్రాలీ ఆటోలో చిలకలూరిపేటలో సరుకు అన్‌లోడ్ చేసి తిరిగి గణపవరం వెళ్తున్నాడు. ఈ క్రమంలో టీబీ ఆసుపత్రి వద్దకు వచ్చే సరికి జాతీయ రహదారి మరమ్మతులు చేస్తున్నందున సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడి, యోహాను గాయపడ్డాడు.

నాడు

టీడీపీ ప్రభుత్వంలో పేదలు సొంత గూడు కోసం ఎన్నో అర్జీలు అధికారులకు ఇచ్చారు. కానీ జన్మభూమి కమిటీల పెత్తనంతో పచ్చచొక్కాలు ధరించిన కార్యకర్తలకే ఇళ్ల మంజూరు కావడంతో అర్హులు అద్దె గృహాల్లోనే ఉండాల్సి వచ్చింది. దీంతో పేదల సొంతింటి కలకలగానే మిగిలిపోయింది.

నేడు

2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవరత్నాల హామీల్లో భాగంగా సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేదరికమే ప్రామాణికంగా నవరత్నాలు– అర్హులందరికీ ఇళ్లలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు అందజేశారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌తో పాటు బిల్లుల్ని సకాలంలో అందజేస్తూ, పేదల సొంతింటి కలను సాకారం చేసి, పేదల గుండెల్లో గూడు కట్టుకున్నారు.



ఈమె పేరు కొత్త లక్ష్మీకుమారి. భర్త శ్రీనివాసరావు లారీ డ్రైవర్. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు. సత్తెనపల్లికి చెందిన వీరికి సొంతిల్లు లేక సుందరయ్య కాలనీ చేనేత సొసైటీల్లో రూ.2,500 చెల్లించి అద్దెకు ఉన్నారు. ఈమె గత ప్రభుత్వంలో సొంతింటి కోసం పలుమార్లు అధికారులు చుట్టూ తిరిగి అర్జీలు అందజేసింది. ఇల్లు మంజూరు చేస్తామని చెబుతూ అధికారులు పట్టించుకోలేదు. జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు కొందరికే మంజూరు చేశారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధి కారంలోకి వచ్చాక నవరత్నాల్లో భాగంగా పక్కా ఇల్లు మంజూరు చేయడంతో సొంతింటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆమె పేర్కొంది.



ఈమె పేరు తొమండ్రు జ్యోతి. భర్త శంకర్ దుకాణంలో గుమస్తా. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. పట్టణంలోని కొత్తపేటకు చెందిన వీరికి సొంతిల్లు లేదు. రూ. 3వేలు చెల్లించి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. తనకున్న స్థలంలో సొంతిల్లు కట్టుకోవాలని అధికారులకు అర్జీ ఇచ్చిన వెంటనే పక్కా ఇల్లు మంజూరు చేశారు. బిల్లులు సైతం వెంటనే చెల్లించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇల్లు మంజూరు కావాలంటే సంవత్సరాలు తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తుండడం సంతోషకరమని పేర్కొన్నారు.

పేదలకు అనుగృహం

- ఉబ్బితబ్బిబ్బవుతున్న లబ్ధిదారులు
- సీఎం జగన్‌తో కల సాకారం
- సత్తెనపల్లి టౌన్‌లో 3,195 మందికి ఇళ్ల స్థలాలు

సత్తెనపల్లి: 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నవరత్నాల్లో భాగంగా పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసింది. పట్టణంలోని 31 వార్డుల్లోని 15 వార్డు సచివాలయాల పరిధిలో ప్రభుత్వ భూములు లేకపోవడంతో సమీపంలోని ప్రైవేట్ వ్యక్తుల భూముల్ని కొనుగోలు చేసింది. ఐదు లేఅవుట్లు నిర్మించింది. జగనన్న కాలనీల పేరుతో వాటిల్లో అన్ని వసతుల్ని కల్పించింది. అందులో సొంతింటి స్థలం లేని వారికి పట్టాతో పాటు ఇళ్లు మంజూరు చేసింది. పట్టణంలోని 3,195 మంది పేదలకు జగనన్న కాలనీల్లో 2,906 మందికి, సొంత స్థలం కలిగిన 245 మందికి కలిపి మొత్తం 3,151 ఇళ్లు మంజూరు చేసింది. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకు గ్రామానికి ఒకరిద్దరికీ మాత్రమే ఐదేళ్లలో ఇళ్లు మంజూరు చేశారు. వాటికి బిల్లులు మంజూరులో జాప్యం చేయడంతో ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కానీ సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నాణ్యమైన మెటీరియల్‌ను సరఫరా చేయడంతో పాటు బిల్లులు సత్వరమే చెల్లించి పేదల సొంతింటి కలను నెరవేర్చారు.



పట్టణంలోని సుందరయ్య కాలనీలో నిర్మించుకున్న ఇల్లు



పట్టణంలోని నాగన్నకుంటలో నిర్మించుకున్న ఇల్లు

మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవ

పట్టణంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్ని పూర్తి చేయించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో పాటు అదనపు వసతుల కోసం పొదుపు గ్రూపుల ద్వారా వడ్డీ లేని రుణం రూ.30 వేలు ఇప్పించారు. దీంతో పట్టణంలో గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం నిర్మాణ మెటీరియల్‌ను ఇవ్వడంతో పాటు బిల్లుల్ని వెంటనే చెల్లిస్తుండడంతో గృహాల్ని త్వరితగతిన నిర్మించుకుంటున్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సత్తెనపల్లి టౌన్‌లో ఇళ్లు, స్థలాల వివరాలు

మొత్తం లేఔట్లు	5
పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు	3,195
మొత్తం మంజూరైన గృహాలు	2,906
పూర్తయిన ఇళ్లు	285
భూమి పూజ చేసినవి	906
పునాది దశలో	1,461
గోడలు దశలో	102
స్లాబు దశలో	152
బిల్లులు రూపంలో విడదలైన నగదు	రూ. 13,32,90,815
మెటీరీయల్ రూపంలో విడుదల	రూ. 7,23,78,522
మొత్తం కలిపి నగదు విడుదల	రూ. 20,56,69,337
సొంత స్థలాల వారికి మంజూరైన ఇళ్లు	245
పూర్తయిన ఇళ్లు	170

అద్దె ఇళ్లలో అవస్థలు పడ్డాం



మాది చిన్న కుటుంబం. నా భర్త, నేను జామకాయలు విక్రయిస్తూ జీవనం వెళ్ల దీస్తున్నాం. చాలా కాలం నుంచి ఇద్దరు బిడ్డలతో అద్దె ఇళ్లల్లో జీవిస్తూ అనేక అవస్థలు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయడంతో చకచకా నిర్మించుకున్నాం. సొంతిల్లు సమకూరడంతో ఆనందంగా ఉన్నాం. జగన్‌మోహన్‌రెడ్డి దేవుడి రూపంలో వచ్చి మా కల నెరవేర్చారు.

–బిడగల శ్రీదేవి, లబ్ధిదారురాలు, నాగన్నకుంట

రుణపడి ఉంటాం



మాది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. నా భర్త రామారావు బేల్దారి మేస్త్రీ. ఎన్నో ఏళ్ల రేకుల ఇంటిలో పిల్లలతో మా కుటుంబం అంతా జీవించాం. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నిజమైన అర్హుల్ని గుర్తించింది. ఇల్లు మంజూరు చేయడంతో సొంతిల్లు నిర్మించుకున్నా. బిల్లులు కూడా ఇచ్చారు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–రంగా కృష్ణవేణి, లబ్ధిదారురాలు, వడ్డవల్లి

శరవేగంగా గృహ నిర్మాణాలు



పట్టణ పేదలకు గ్రామీణ ప్రాంతంలోని ఐదు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం నాణ్యమైన మెటీరియల్ సరఫరా చేయడంతో పాటు బిల్లులు వెంటనే చెల్లిస్తుండటంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయడం గతంలో ఎన్నడూ ఇంత పెద్దఎత్తున జరగలేదు.

–ఆర్.వి. సుబ్బారావు, ఏఈ, గృహనిర్మాణ శాఖ, సత్తెనపల్లి

భక్తిశ్రద్ధలతో మొహర్రం ప్రార్థనలు



రెడ్డిగూడెంలో పీర్లను ఊరేగిస్తున్న ముజావర్లు



దొడ్లేరులో జరిగిన పీర్ల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు



ముప్పాళ్లలో పీర్ల ఊరేగింపు



గుండ్లపల్లిలో జరిగిన ఊరేగింపులో భక్తులు



గుడిపూడిలో మొహర్రం వేడుకలను తిలకిస్తున్న ప్రజలు

నకరికల్లు: పవిత్ర మొహర్రం పర్వదినాన్ని మండలంలోని గుండ్లపల్లి, చల్లగుండ్ల గ్రామాల్లో ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. యా హుస్సేన్...యా హుస్సేన్ అంటూ అమరుల్ని స్మరించుకుంటూ నినాదాలు చేశారు. 9వ రోజు శుక్రవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. పీర్లను పట్టుకున్న ముజావర్‌లు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం పీర్లతో నృత్యాలు చేశారు. పీర్లకు అలంకరించిన పూలదండల నుంచి రాలే పూల కోసం భక్తులు పోటీపడ్డారు. ఈ పూలను స్వీకరిస్తే సర్వసుఖాలు సిద్ధిస్తాయని, అనుకున్న కోరికలు ఫలిస్తాయని ముస్లింల విశ్వాసం. 11రోజుల పాటు నిర్వహించే మొహర్రంలో భాగంగా శనివారం 10వ రోజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రపంచశాంతి కోసం దువా చేశారు. ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ముజావర్లు, ముస్లింలు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

పవిత్ర యుద్ధంలో ప్రాణాలు అర్పించిన వారి త్యాగాల్ని గుర్తు చేసుకుంటూ ముస్లింలు మొహర్రం పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. చావడిల వద్ద ప్రత్యేకంగా అలంకరించిన పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెడ్డిగూడెంలో ముజావర్లు పీర్లతో గ్రామంలో ఊరేగింపు చేశారు. పలువురు భక్తులు పీర్లకు వార్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లకు అలంకరించిన పూలను అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. మండలంలోని ఇనిమెట్ల, మొక్కపాడు, అనుపాలెం, గణపవరం గ్రామాల్లో వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

క్రోసూరులో..

మొహర్రం పండుగ వేడుకలు మండలంలో పలు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. దొడ్లేరులో రెండు చావిడిల వద్ద ఏర్పాటు చేసిన పీర్లను ముజావర్లు వేకువజామున ఘనంగా ఊరేగించారు. అగ్నిగుండాలు ఏర్పాటు చేసి పీర్లతో గుండాల మీదగా భక్తులు నడిచి తమ భక్తిని చాటుకున్నారు. వేడుకల్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలి వచ్చారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పీర్ల ఊరేగింపులోపాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

మండలంలోని ముప్పాళ్ల, గోళ్లపాడు, మాదల గ్రామాల్లో మొహర్రం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. యువకులు పీర్లను ఎత్తుకొని ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.

నకరికల్లులో..

పవిత్ర మొహర్రం వేడుకలు ముగింపు సందర్భంగా శనివారం పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. పవిత్ర ధర్మయుద్ధంలో అమరులైన వారిని స్మరించుకుంటూ పీర్లతో నిర్వహించిన గ్రామోత్సవంలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. గుండ్లపల్లిలో నిర్వహించిన ఊరేగింపులో హుస్సేన్..హుస్సేన్ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. చీకటిపడే వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పురవీధుల్లోకి వచ్చిన పీర్లకు మహిళలు వార్లు పోసి మొక్కులు చెల్లించారు. ఊరేగింపు అనంతరం గ్రామ శివారులోని చెరువులో పీర్లకు పవిత్ర స్నానం ఆచరింపజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

సత్తెనపల్లిలో..

మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకల్ని సత్తెనపల్లి మండలంలోని కొమెరపూడి, పాకాలపాడు, రెంటపాళ్ల, గుడిపూడి, నందిగామ తదితర గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. పీర్లను కనకతప్పట్లతో ఊరేగించారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

పెదకూరపాడు: మండలంలోని బలుసుపాడు, పాటిబండ్ల గ్రామాల్లో శనివారం పెద్దసంఖ్యలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి కార్యకర్తలు చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. 15 కుటుంబాలు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందేలా ఆయన పాలన సాగుతోందని వివరించారు. దీంతో పెదకూరపాడు నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో పార్టీలో చేరుతున్నారని వివరించారు. నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

గ్రామాల్లో ఓటు హక్కుపై చైతన్యం కల్పించాలి

బెల్లంకొండ: గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వివిధ గ్రామాల బూత్ లెవల్ ఏజెంట్లు, మండల నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి ఓటు ప్రాధాన్యం గురించి వివరించాలని సూచించారు. ఓట్లులో మార్పు చేర్పులు ఉంటే వాటిని సరి చేసుకునే విధానం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. ఏజెంట్లు తప్పనిసరిగా తమ బూత్ పరిధిలో ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలో ముస్లింల కోసం ఎంపీ నిధులు రూ.25లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ (షాదీఖానా) నిర్మాణ పనుల్ని ఎమ్మెల్యే పరిశీలించారు. మాచాయపాలెంలో నిర్మిస్తున్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, ఎంపీ నిధులు రూ.25 లక్షలతో నిరిస్తున్న బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, సొసైటీ పర్సన్ ఇంచార్జ్ భద్రయ్య, మండల నాయకులు మర్రి ప్రసాదరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలి

సత్తెనపల్లి: ఆప్కాస్‌లో విలీనం చేసిన కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న రాయితీలన్నీ వారికి వర్తింప చేయాలని ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి కన్వీనర్ కంబాల శ్రీనివాస్ శనివారం డిమాండ్ చేశారు. పండగ సెలవులు పూర్తిగా వర్తింపచేయాలని, పెరుగుతున్న నిత్యవసర ధరలు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు కొరత ఏర్పడిందని తెలిపారు. పురపాలక సంఘం ద్వారా వసూలు చేస్తున్న చెత్తపై యూజర్ చార్జీలు, ఇంటి పన్నులు, తడి పొడి చెత్త వల్ల టెండర్ ద్వారా వస్తున్న నిధులతో పనిముట్లను కొనాలని ఆయన కోరారు.

కాపుల నిరసన ర్యాలీ

అమరావతి: కులం పేరుతో దూషిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో వాయిస్ మెసెజ్‌లు పెట్టినందుకు నిరసనగా పెదకూరపాడు నియోజకవర్గంలోని కాపు నాయకులు, యువకులు శనివారం స్థానిక మెయిన్ రోడ్డులో నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. పెదకూరపాడు నియోజకవర్గంలో లారీ ఓనర్లు తమ సౌకర్యం కోసం ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపులో ఇటీవల విడుదలైన బ్రో సినిమా బాగుందని పోస్టులు పెట్టుకున్నారు. ఈ క్రమంలో అదే గ్రూపులో ఉన్న మండల పరిధిలోని లేమల్లెకు చెందిన మేకల వెంకట్ ఈ పోస్టుపై స్పందించే క్రమంలో కాపు కులాన్ని ఇష్టారాజ్యంగా తిడుతూ వాయిస్ మెసెజ్‌లు పెట్టాడు. దీనిపై శనివారం సుమారు 200మంది కాపు కులస్తులు రాజకీయాలకు అతీతంగా పోస్టాఫీస్ వద్దనున్న రంగా విగ్రహం నుంచి ర్యాలీగా బయలు దేరారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి క్రోసూరు రోడ్డు మీదుగా పోలీస్ స్టేషన్ వరకు సాగింది. అనంతరం సీఐ బ్రహ్మంకు వినతి పత్రం ఇచ్చారు. కాపుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడితే సహించమని, మేకల వెంకట్‌పై కేసు నమోదు చేయాలని, కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక పల్లపు వీధికి చెందిన విన్నకోట శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ర్యాలీలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున కాపు కులస్తులు పాల్గొన్నారు.



అమరావతి మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న కాపులు

7 నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో ఆగస్టు 7 నుంచి 11 వరకు ఐదు రోజుల పాటు ఉపాధ్యాయులకు బోధన నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. శిక్షణ తరగతుల బ్రోచర్‌ను శనివారం సాయంత్రం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త ఆవిష్కరించారు. కళాశాల విద్యా కమిషనరేట్ సౌజన్యంతో జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా బోధన నైపుణ్యాల్ని పెంపొందించుకునేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య తెలిపారు. తరగతులకు రిసోర్స్ పర్సన్స్‌గా న్యూఢిల్లీ ఎన్‌ఐఈపీఏ ప్రొఫెసర్లతో పాటు విద్యారంగంలో నిష్ణాతులు హాజరవుతారన్నారు. ఐదు రోజుల పాటు 600మంది అధ్యాపకులు శిక్షణ తరగతుల్లో పాల్గొంటారని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్ వివరాలకు 9490645147, 9985048923 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

నకరికల్లు: కులమతాలకు అతీతంగా గుండ్లపల్లి ఎంప్లాయిస్ యూనియన్ సేవా కార్యక్రమాలు చేపడుతోందని ఆ సంఘం కార్యదర్శి కొలుముల ఇమామ్ వలి తెలిపారు. మొహర్రం పండుగను పురస్కరించుకొని గుండ్లపల్లిలో ఇద్దరు పేదలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వితంతు మహిళలు నెమలికంటి తిరుమలమ్మ, సుంకరపు సుబ్బాయమ్మలకు బియ్యం, నగదు, కిరాణా సరుకులు పంపిణీ చేశామని చెప్పారు. ఉద్యోగరీత్యా పలు ప్రాంతాల్లో ఉన్న గుండ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు సంఘంగా ఏర్పడి స్వగ్రామంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ఏరియా వైద్యశాలకు ఫర్నీచర్ బహూకరణ

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలకు అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో పెదకూరపాడు నీలిమ నర్సింగ్ హోం నిర్వాహకుడు డాక్టర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి సహకారంతో రూ.20 వేలు విలువైన ఫర్నీచర్‌ను శనివారం అందించారు.ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ వైద్యశాల అభివృద్ధికి కొత్త రామకృష్ణ సహకారం అందిస్తున్నారన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ హాస్పిటల్‌కు అవసరమైన ఫర్నీచర్ లేకపోవడంతో సమావేశాల్లో డాక్టర్లు, స్టాఫ్ ఇబ్బంది పడుతున్నారన్నారు. మెడికల్ హోల్‌సేల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావిక్రింది మల్లికార్జునరావుని సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి డాక్టర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి సహకారంతో ఫర్నీచర్ అందించారని వివరించారు. కార్య





